క్లుప్తంగా

రేపు కీళ్ల నొప్పుల పరీక్ష శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గాంధీ రోడ్డులోని రోటరీ కంటి ఆస్పత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఉచిత కీళ్ల నొప్పుల పరీక్షా శిబిరం ఇర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి బాలసూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. మోకాళ్లు, వెన్నెముక, మెడ, భుజాలు, తల, సయాటికా తుంటి తదితర నొప్పులకు డాక్టర్ ఎం.అక్షిత్ చికిత్సలు అందిస్తారని వారు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



భోజనం వడ్డిస్తున్న శ్రీనివాసస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : అమావాస్య సందర్భంగా రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలోని కాలభైరవ స్వామికి శ్రీలక్ష్మికుభేర స్వర్ణాకర్షణ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి కొర్రపాడు రోడ్డులోని మున్సిపల్ పెట్రోలు బంకు వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకుడు శ్రీనివాసస్వామి, సభ్యులు సురేంద్రకుమార్, మల్లికార్జున, సుధీర్, చక్రపాణి, సాయి, చరణ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జూదరులు అరెస్టు

అట్లూరు : పేకాట ఆడుతున్న ఏడు మందిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ కేసీ.రాజు తెలిపారు. మండల పరిధిలోని లింగాల కుంట దగ్గర పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి ఏడు మందిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.1,570 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు ఇందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 9440905478, 9985606866 నెంబరులో సంప్రదించాలన్నారు.

20న అద్దె గదులకు వేలం

మైదుకూరు : మైదుకూరులోని కడప రోడ్డులో ఉన్న జెడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని మూడు గదులకు ఈనెల 20వ తేదీన జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు ఎంపీడీఓ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.5వేలు ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో రూములను దక్కించుకున్న వారు రూ.2లక్షలను నాలుగు విడతల్లో అడ్వాన్స్ కింద చెల్లించాలని వివరించారు.

వెల్లాలలో ఆలయాల భూమి వేలం పాట

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాలకు సంబంధించిన 7 ఎకరాలను కౌలు కోసం వేలం పాట నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్ఆర్ నరసింహాసింగ్, ఈఓ నరసయ్య, ఆలయ చైర్మన్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఏడు ఎకరాల పొలాన్ని రూ.60వేలకు పాట పాడి దక్కించుకున్నారు. అలాగే రాజోలి గ్రామ పొలంలో ఉన్న 7.80 ఎకరాల వేలంపాట వాయిదా వేసినట్లు వారు తెలిపారు. అనంతరం స్వాములకు భక్తులు సమర్పించిన పలు రకాల వస్తువులను వేలం పాట వేశారు. ఇందులో రూ.97,693 ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, రైతులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



జగనన్న ఆణిముత్యాలు నగదు బహుమతులు అందుకున్న విద్యార్థినులు



కొర్రపాడులో మొదటి బహుమతి రూ.3 వేలను అందజేస్తున్న సూర్యనారాయణరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక మోడంపల్లె మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో శనివారం పాఠశాల స్థాయి జగనన్న ఆణిముత్యాల నగదు బహుమతులను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో సి.స మీరా 559, జె.షాహిదా 551, ఎస్.అఫియా 548 మార్కులు సాధించినందుకు వరుసగా మొదటి బహుమతి రూ.3వేలు, రెండో బహుమతి రూ.2వేలు, మూడో బహుమతి రూ.1000 సర్టిఫికెట్, మెడల్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమాంహుస్సేన్, మాజీ కౌన్సిలర్ మహ్మద్ రఫీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్.కాలేషా అందించారు. అలాగే ఇంగ్లీషు మీడియంలో మొదటి స్థానం సాధించిన సమీరాకు హెచ్ఎం ఇమాంహుస్సేన్ రూ.5వేలు, ఉర్దూ మీడియంలో మొదటి స్థానం సాధించిన షాహిదకు వ్యాయామ ఉపాధ్యాయుడు కత్తి వెంకటసుబ్బారెడ్డి రూ.5వేలు, సైన్స్‌లో అత్యధికమార్కులు సాధించినందుకు సైన్స్ ఉపాధ్యాయుడు జి.షేక్షావలి రూ.516 అందించారు. అనంతరం కొత్తగా చేరిన 6వ తరగతి చేరిన 65 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు మునెమ్మ, జ్యోతి మంజుల, ఫరీదా, ఆయిషా, గౌస్‌మొహిద్దీన్, సహమీద్‌బాషా, షేక్షావలి, ప్రశాంత్‌రాజు, షాకీర్‌వుల్లా, పేరెంట్స్ కమిటీ మెంబర్ శ్యామలమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి

రాజుపాళెం : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా కొర్రపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి ఫలితాల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఆయన రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున నగదును అందజేశారు. మండలంలోని 8 జెడ్పీ హైస్కూళ్లు, 1 వెల్లాల గ్రామంలో బాలికల గురుకుల పాఠశాల కలిపి మొత్తం 29 మంది ఎంపికైనట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం నాగేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాజీపేట : విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి సూచించారు. ఖాజీపేట బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ. 3వేలు, రెండవ బహుమతిగా రూ. 2వేలు, మూడవ బహుమతిగా రూ. వెయ్యి అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న రచనా చైతన్య

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చిన్మయ మిషన్ నిర్వాహకురాలు రచనా చైతన్య పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పద్మశాలీయ కల్యాణ మండపంలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు గాజులపల్లె పెద్ద సుబ్బయ్య పెద్దసుబ్బమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికబద్ధంగా కష్టపడితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని సూచించారు. సేవా సంస్థ అధ్యక్షుడు గాజులపల్లె రామచంద్రుడు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడానికి పదో తరగతి విద్యార్థులకు నగదు పురస్కారాలను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం మండలంలోని 19 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.2,116, రెండో బహుమతి రూ.1,016 చొప్పున 41 మంది విద్యార్థులకు రూ.80వేలు అందించారు. ఈ సందర్భంగా సాహిత్య రంగంలో రాణిస్తున్న డాక్టర్ మూలె రామమునిరెడ్డి, రామసుబ్బయ్య, సుబ్బరాయుడు, చిన్నమునెయ్యలను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మానతా సేవా సంస్థ చైర్మన్ సన్నుతి శ్రీనివాసులు, డాక్టర్ సంధ్యారాణి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : మండలంలోని మడూరు పంచాయతీ చిన్న వరదాయపల్లె గ్రామంలో శనివారం మలేరియా, డయేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించి రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమం సీహెచ్ఓ మహదేశ యాదవ్, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, ఏఎస్ఎం వనజ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణపై అవగాహన



ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న రాఘవయ్య

ఖాజీపేట : అతిసార నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య సూచించారు. శనివారం ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అతిసార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిసార నియంత్రణకు ఓఆర్ఎస్ లేదా జింక్‌ను సరైన చికిత్సాగా వైద్యులు సూచించారని అన్నారు. లీటరు నీటిలో ఓఆర్ఎస్ పాకెట్‌ను కలపాలిపి విరేచనాలు అయ్యేటప్పుడు తాపించాలన్నారు. తల్లి పాలు పిల్లలకు ఎంతో ఆరోగ్యకరం అన్నారు. పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు పూర్తి అవగాహన వచ్చేలా ఏఎన్ఎంలు వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, సీహెచ్ఓ వెంకటసుబ్బమ్మ, ఆశావర్కర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం



స్వామి వారికి పుష్పయాగం

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో గల శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరు రోజుల పాటు ఘనంగా జరిగి శనివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వైభవంగా వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, ధనలక్ష్మి, సభ్యులు రాఘవేంద్ర, అనీత్, పావని, వెంకటసుబ్బయ్య, మేనేజర్ వెంకటరమణ, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కూలిన చెట్టు

రాజుపాళెం : ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం శనివారం సాయంత్రం పడింది. ఈ క్రమంలో మండలంలోని గాదెగూడూరు – వెంగళాయపల్లె గ్రామాల మధ్యలో అక్కదేవతల ఆలయం వద్ద ఉన్న వేపచెట్టుపై పిడుగు పడింది. అయితే ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ క్రమంలో జగనన్న విద్యాకానుక ఇవ్వడానికి వెళుతున్న నాగభూషణం పది మీటర్ల దూరంలో ఉండగానే చెట్టుపై పిడుగు పడింది. దీంతో ఆయన తిరిగి రాజుపాళెంకు చేరుకున్నారు. అలాగే మండలంలోని గాదెగూడూరు, రాజుపాళెం తదితర గ్రామాల్లో ఈదురుగాలుల ధాటికి ఆరు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్ తమ సిబ్బందితో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ మోటారు చోరీ

చాపాడు : మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని మండల కేంద్రమైన చాపాడులోని పోలీసు స్టేషన్ సమీపంలో గల రంగయ్య సత్రం పొలంలో శుక్రవారం రాత్రి వ్యవసాయ విద్యుత్ మోటారు చోరీకి గురైంది. చాపాడుకు చెందిన రాజోలి దొరస్వామిరెడ్డి రంగయ్య సత్రంకు చెందిన సర్వే నంబరు 53/3ఏలో కౌలు పొలం సాగు చేసుకుంటున్నారు. గత పదిహేనేళ్లుగా వ్యవసాయ మోటారు వేసుకుని బోరు నీటి ద్వారా వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం నీరు కట్టేందుకు పొలం వద్దకు వెళ్లగా విద్యుత్ మోటారు దొంగతనానికి గురైనట్లు గుర్తించాడు. ఈ ఘటనపై విచారించి దీనికి కారణమైన దుండగులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రేపటి నుంచి వీరయ్య స్వామి ఆరాధన మహోత్సవం

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామంలో వెలసిన అవధూత దిగంబర వీరయ్య స్వామి దేవాయలం వద్ద సోమ, మంగళవారాల్లో 46వ ఆరాధన మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. గురుపూజ పుష్పాలంకరణతో ఆరాధన ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వీరయ్య స్వామి ప్రత్యేక పూజలు చేయటంతో పాటు వివిధ గ్రామాల తాలాల భజన బృందాలచే 24 గంటల పాటు నిరంతరంగా సంకీర్తనలు నిర్వహించనున్నారు. సోమవారం రాత్రి అద్దంకికి చెందిన శ్రీ సాయి నాట్యకళా సమితి వారిచే దేవ నర్తకి పూర్తి నాటకం, ఉదయం నుంచి ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరాధన మహోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని శనివారం నిర్వాహకులు ఆహ్వానించారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి

దువ్వూరు : దువ్వూరులోని జాతీయ రహదారిపై ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాల్లో ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రతివాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించక పోతే ఎలా..?

అట్లూరు : సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షురాలు పొత్తపి రమాదేవి పేర్కొన్నారు. శనివారం ఆమె ఉదయం 10–30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అయితే ఎంపీడీఓతో పాటు సిబ్బంది కూడా ఏఒక్కరూ విధులకు రాలేదు. దీంతో ఖాళీ కుర్చీలు దర్శన మిచ్చాయి. అయితే 11 గంటల వరకూ వేచిచూసి వెను దిరిగారు. సమయపాలన పాటించని ఎంపీడీఓతో పాటు అధికారులు సిబ్బందిపై ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళతానని మండల అధ్యక్షురాలు పేర్కొన్నారు.

రైతులకు ఉత్తమ సేవలు అందించాలి

– జిల్లా వ్యవసాయాధికారి ఐతా నాగేశ్వరావు



వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

ఖాజీపేట : రైతులకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి ఐతా నాగేశ్వరావు వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఖాజీపేట మండలం పుల్లూరు పంచాయితీలోని రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందే పురుగు మందులు, ఎరువులు, విత్తనాల రికార్డులను పరిశీలించారు. అనంతరం మట్టి నమూనాల సేరణపై ఆరాతీశారు. ఇప్పటి వరకూ మండలంలో 402 మట్టి నమూనాల సేరణ పరీక్షలకు పంపడం జరిగిందని ఏఓ నాగార్జునా చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఉన్నతస్థాయికి చేరుకోవాలి



పోరుమామిళ్ల : మహమ్మద్ జమీర్‌కు ప్రథమ బహుమతి ఇస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

పోరుమామిళ్ల : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలకు ధీటుగా పనిచేస్తున్నాయని, ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో వచ్చిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకం కింద నగదు బహుమతులు ఆయన అందచేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వచ్చిన విద్యార్థులు మహమ్మద్ జమీర్, గురుశాంతి, సబీరలకు ప్రభుత్వం ఇచ్చిన రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. వెయ్యికి తోడుగా విజయప్రతాప్‌రెడ్డి తన సొంత డబ్బు రూ. 2 వేలు, 1 వెయ్యి చొప్పున వారికి అందించి అభినందించారు. కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, హెడ్మాస్టర్ శివప్రసాద్, యువ నాయకులు గిరిప్రణీత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

గోపవరం : జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. శనివారం మండలంలోని రాచాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జడ్పీటీసీ జయరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ, కమిటీ చైర్మన్ రామసుబ్బమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చంద్రకళకు ప్రథమ, అనితకు ద్వితీయ, సిద్దార్థకు తృతీయ బహుమతులు అందజేశారు. హెడ్మాస్టర్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు సర్పంచ్ నాగేంద్ర, రవిచంద్రారెడ్డి, సుందరరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బా గురుకుల బాలిక విద్యాలయానికి చెందిన ఇంటర్, పదో తరగతి విద్యార్థులు ప్రతిభ చూపి శనివారం కడపలో కలెక్టర్ విజయ రామరాజు చేతుల మీదుగా జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలుగా అవార్డు అందుకున్నారు. ఇంటర్ హెచ్ఈసీ విద్యార్థిని లక్ష్మీదేవి రూ.50 వేలు, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సరళ రూ.15వేల నగదు బహుమతిగా అందుకున్నారు. ఈ అవార్డులు సాధించిన విద్యార్థినులను ప్రత్యేకాధికారి రెడ్డిజ్యోతి, ఇతర సిబ్బంది అభినందించారు.

కస్తూర్బాగాంధీ విద్యార్థిని ప్రతిభ

పోరుమామిళ్ల: ఈ సంవత్సరం ఇంటర్ పరీక్షల్లో ఎంపీసీలో 932 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన పోరుమామిళ్ల కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల విద్యార్థిని జె. మణి కుమారి శనివారం జగనన్న ఆణిముత్యాలు పథకం కింద ప్రథమ బహుమతిగా రూ. 50 వేలు నగదు బహుమతి అందుకున్నట్లు ఎస్ఓ నాగమల్లేశ్వరి తెలిపారు. కడప లో శనివారం జరిగిన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ రామరాజు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, సర్వశిక్షా అభియాన్ పీఓ అంబవరం ప్రభాకరరెడ్డి తదితరుల సమక్షంలో వారి చేతుల మీదుగా బహుమతి, మెమొంటో, ప్రశంసాపత్రం అందుకున్నట్లు ఎస్ఓ తెలిపారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దాసరి సుధ

కలసపాడు : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. మండలంలోని తెల్లపాడు, దూలంవారిపల్లె గ్రామాల్లో ఆమె శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించి సంక్షేమ పథకాల అమలు గురించి ఆమె వివరించారు. పథకాల లబ్ధిని బుక్‌లెట్‌తో వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంట్‌రోడ్లు నిర్మించేలా చూస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా వృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. తన దృష్టికి ప్రజలు నివేదించిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తెల్లపాడులోని ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరారు. దూలంవారిపల్లెలో మంచినీటి సమస్య ఉందని, పరిష్కరించాలని ప్రజలు విన్నవించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామక్రిష్ణారెడ్డి, నారాయణ యాదవ్, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పశువుల సంతలో మెరుగైన సౌకర్యాలు



జగనన్న కాలనీలో ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువుల సంతలో రూ.1.13 కోట్లతో చేపట్టిన సౌకర్యాల కల్పన పనులకు శనివారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. పశువుల సంతలో రూ.21.37 లక్షలతో సీసీ రోడ్లు, రూ.26.92 లక్షలతో కవర్డ్ ప్లాట్ ఫారాలు, రూ.32.40 లక్షలతో సీసీ ప్లాట్ ఫారాలు, రూ.32.40 లక్షలతో పశువుల లోడింగ్, అన్‌లోడింగ్ సీసీ ప్లాట్ ఫారాలను నిర్మించనున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గృహ ప్రవేశం :

మున్సిపాలిటీ పరిధిలోని ముక్కొండ వద్ద నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలో శనివారం పూర్తయిన ఓ ఇంటిని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి గృహ ప్రవేశం చేయించి ప్రారంభించారు. కాలనీలోని డిబ్లాక్‌లో 379 నంబర్‌గల ఇంటిని లబ్ధిదారు మహబూబ్ చాంద్ బాషా పూర్తి చేశారు. ఆ ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించి అభినందించారు. కాలనీలో మొత్తం 2,169 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికే చాలా ఇళ్లు పూర్తయ్యాయి. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, హౌసింగ్ ఏఈ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

రాయలసీమ శంఖారావాన్ని విజయవంతం చేయండి

ప్రొద్దుటూరు క్రైం : అనంతపురంలోని ఏపీఎన్జీఓ భవనం వద్ద జూలై 3న నిర్వహించనున్న రాయలసీమ శంఖారావాన్ని విజయవంతం చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తరతరాలుగా రాయలసీమకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రత్యేక రాయలసీమ కోసం ప్రజలు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. గుంతకల్లు రైల్వేజోన్ ప్రకటించాలని, రాయలసీమలోని అన్ని జిల్లాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఏర్పాటు చేయాలని, సీమ సంస్కృతి, సంప్రదాయాలైన ఉత్సవాలను, జాతరలను ప్రభుత్వమే నిర్వహించాలని ఇంకా అనేక డిమాండ్లతో రాయలసీమ శంఖారావాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాయలసీమ జిల్లాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు.

పౌష్టికాహారం కిట్లు పంపిణీ



పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో ఉన్న టీబీ యూనిట్‌లో శనివారం సాయంత్రం ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 15 మంది టీబీ వ్యాధిగ్రస్తులైన పేదలకు మట్టిమసీదుకు చెందిన కాగితాల మహమ్మద్ షఫీ సహకారంతో పౌష్టికాహారం కిట్లను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల వ్యాధిగ్రస్తులకు వేరుశనగ పప్పు, పెసలు, పప్పులు, బెల్లం, ఖర్జూరం, గోదుమ పిండి, గోదుమ రవ్వ, రాగిపిండితో కూడిన పౌష్టికాహారంతో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ శివప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్లు మాధవరెడ్డి, హుస్సేన్‌బాషా, హెల్త్ విజిటర్లు గురుప్రసాద్, సిద్దారెడ్డి, ఎల్‌టీ విజయ్, భవ్య, ఎన్జీఓలు రఘు, చందు, ఫాజియాలు పాల్గొన్నారు.

హమ్మయ్యా.. చినుకు రాలింది



రాజుపాళెం పొలాల్లో నిలిచిన వర్షం నీరు

రాజుపాళెం: నిన్నా మొన్నటి వరకు ఎండలు విపరీతంగా కాసాయి. దెబ్బకు ముసలీ ముతకా, పిల్లా జల్లా విలవిల్లాడిపోయారు. అంతేనా పురుగుపుట్రా.. చెట్టూచేమా ఎండిపోయాయి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆకాశంలో మార్పు వచ్చింది. ఈదురు గాలులలో కూడిన జోరు వర్షం పడింది. చివరకు వాతావరణం చల్లబడటంతో గ్రామస్తులు ఇంటి నుంచి బయటకు వచ్చి ఊపిరి పీల్చుకొని చల్లదనాన్ని ఆస్వాదించారు. కొన్నిచోట్ల బలంగా వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. ఫలితంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది.